నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, గురువారం 31 అక్టోబర్ 2024 | SURYAPET

సూర్యాపేటలో పటాకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

దీపావళి సందడి

- రెండు రోజుల పండుగ సంబురం
- మార్కెట్లలో జోరుగా పూజ సామగ్రి, పటాకుల కొనుగోళ్లు
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

నేరేడుచర్ల/ సూర్యాపేట టౌన్, అక్టోబర్ 30 : దీపం.. చీకటి నుంచి వెలుగుకు దారి చూపేది. చైతన్య దీప్తిని నింపేది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక.. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు సంకేతమైన దీపావళి పండుగను ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సిద్ధమయ్యారు. నేడు ఉదయం నరక చతుర్దశి, సాయంత్రం 6 గంటల నుంచి అమావాస్య వస్తుండడంతో శుక్రవారం వరకు దీపావళి జరుపుకోనున్నారు. ఈ పర్యాయం రెండు రోజులు పండుగ ఉండడం విశేషం. ఇక పూలు, పండ్లు, ప్రమిదలు, పూజా సామగ్రి, పటాకులు, స్వీట్ల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. ఇండ్లలో అలంకరణ కోసం విద్యుద్దీపాలతోపాటు, ప్లాస్టిక్ పూల దండలు సైతం జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి తీసుకొచ్చిన ఎర్రని రంగు ప్రమిదలు ఆకర్షణీయంగా ఉన్నాయి. దీపావళి సందర్భంగా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతుల వలె ప్రతి ఇంటా వెలుగులతో నిండాలని ఆకాంక్షించారు. దీపాల వెలుగులు అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలని, బంగారు తెలంగాణ సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలని తెలిపారు.

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

వైటీపీఎస్‌లో అల్యూమినియం రోల్స్ చోరీ ముఠా అరెస్ట్

- రూ.15.35లక్షల నగదు స్వాధీనం

మిర్యాలగూడ, అక్టోబర్ 30 : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ పరిధిలోని యాదాద్రి పవర్ ప్లాంట్ స్టోర్ యార్డ్ వద్ద డంప్ చేసిన అల్యూమినియం రోల్స్‌ను దొంగిలిస్తున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పీ క్యాంపునకు చెందిన షేక్ మునీర్, దామరచర్ల మండలం ఇర్కిగూడేనికి చెందిన కంబాల అశోక్, గోపిశెట్టి అజయ్, పసుపులేటి కోటేశ్వర్‌రావు, సెక్యూరిటీ గార్డ్ పుల్లయ్యను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గతంలో వైటీపీఎస్‌లో సామగ్రిని దొంగతనం చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రంజిత్‌కుమార్‌వర్మ, అభయ్, ప్రతాప్, మౌర్యను ఇటీవల అరెస్ట్ చేసి విచారణ చేపట్టగా మరి కొందరు అల్యూమినియం రోల్స్ దొంగతనం చేస్తున్నట్లు తేలిందన్నారు. వీరంతా బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన స్టోర్‌యార్డు వద్ద సెక్యూరిటీలుగా పనిచేసే సిబ్బందితో పరిచయం చేసుకొని సూపర్‌వైజర్ల సాయంతో తమ వాహనాల్లో అల్యూమినియం రోల్స్ లోడ్ చేసుకొని హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన షర్ఫొద్దిన్, ఖైరుద్దిన్, షేక్ ముజీబ్, వహీద్‌అలీకి విక్రయించి సొమ్ము చేసుకున్నారని తేలిందని చెప్పారు. ఒక్కో అల్యూమినియం రోల్ రూ.6.50 లక్షల విలువ ఉండగా వీరు రూ. లక్షకే విక్రయించినట్లు తెలిపారు. మరో పది మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్ట్ చేసి మరికొంత విలువగల ప్రాపర్టీని రికవరీ చేస్తామని అన్నారు. నిందితుల నుంచి రూ.15.35లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, సీసీఎస్ ఏఎస్ఐ అప్జల్‌అలీ, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, పుష్పగిరి, ఇమ్రాన్, వహీద్, లింగారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

ఫలించిన బీఆర్ఎస్ పోరాటం

విద్యుత్ చార్జీల పెంపునకు చెక్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ సంబురాలు

సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- తెలంగాణ విగ్రహాలకు క్షీరాభిషేకం
- పటాకులు కాల్చి హర్షాతిరేకాలు
- పదేండ్లలో ఎన్నడూ విద్యుత్ చార్జీలు పెంచని బీఆర్ఎస్ సర్కారు
- జనం జేబులు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల, రవీంద్రకుమార్

విద్యుత్ చార్జీలను పెంచాలని చూసిన కాంగ్రెస్ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ తిప్పికొట్టడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలపై బిల్లుల భారం పడకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు బీఆర్ఎస్ వాదనలు వినిపించి చార్జీల పెంపు యత్నాన్ని అడ్డుకోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంబురాలు జరిగాయి. పలుచోట్ల తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్ఎస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశాయి. పటాకాలు కాల్చి సంతోషం పంచుకున్నాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలోమాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, దేవరకొండలో మాజీ ఎమెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పాల్గొనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎన్నడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ జనం జేబులు కొల్లగొట్టాలన చూస్తున్నదని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలను పెంచాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదనలకు బీఆర్ఎస్ తరపున మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అడ్డుకట్ట వేసి వారి ప్రయత్నాలను భగ్నం చేశారన్నారు. మఠంపల్లిలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎన్నడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ మరింత భారం మోపాలని చూస్తున్నదని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లాకేంద్రంతోపాటు ఆలేరు, అడ్డగూడూరులో పటకాలు కాల్చి సంబురాలు చేశారు.

టీఎన్‌జీఓస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ



నీలగిరి, అక్టోబర్ 30 : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రావణ్‌కుమార్ కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. ఇటీవల శ్రావణ్‌కుమార్ మామగారు శేషగిరిరావు మరణించడంతో ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బొజ్జ వెంకన్న తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మిల్లర్లు త్వరగా బ్యాంకు గ్యారెంటీ అగ్రిమెంట్ ఇవ్వాలి

- ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, అక్టోబర్ 30 : జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులు త్వరగా ప్రభుత్వంతో బ్యాంకు గ్యారెంటీ అగ్రిమెంట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.రాంబాబు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నూతనంగా విడుదల చేసిన జీఓ 21.27 ప్రకారం ఎలాంటి డీఫాల్ట్ లేని రైస్ మిల్లర్లు 10శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా 25శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని తెలిపారు. సంబంధిత సివిల్ సప్లయ్ మేనేజర్ దగ్గర అగ్రిమెంట్ పేపర్లు ఉన్నాయని వాటిని పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఇంకా రైస్ మిల్లర్లకు బ్యాంకుకు సంబంధించిన సమస్యలు, సందేహాలు ఉంటే లీడ్ బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాలని చెప్పారు. ప్రస్తుతం వరి కోతలు చురుగ్గా సాగుతున్నందున మిల్లులకు వచ్చే వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లు దిగుమతి చేసుకొని నిల్వ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి డి. రాజేశ్వర్, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర, అక్టోబర్ 30 : మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు నవంబర్ 9వరకు పొడిగిస్తున్నట్లు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8, 2025న జరుగుతుందని, దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పండుగకు పల్లెబాట

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వాహనాల బారులు

బీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ వాసులు పల్లెబాట పట్టారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు రావడంతో గురువారం గ్రామాలకు బయల్దేరారు. దాంతో వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి. చౌటుప్పల్, తదితర ప్రాంతాల్లో వాహనాలు బారులుదీరి వెళ్లాయి.

– చౌటుప్పల్, అక్టోబర్ 30

15వరకు బీఆర్ఏఓయూ అడ్మిషన్లు

రామగిరి, అక్టోబర్30 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు డిప్లొమా కోర్సుల్లో చేరడానికి అడ్మిషన్ల గడువును నవంబర్ 15వరకు పొడిగించినట్లు ఆ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ బి.ధర్మానాయక్, బీఆర్ఏఓయూ నల్లగొండ రీజినల్ సెంటర్ కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూజీ కోర్సులకు, నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో పీజీ కోర్సులో అడ్మిషన్లకు స్టడీ సెంటర్స్, మహిళలకు ప్రత్యేకంగా నల్లగొండలోని ఉమెన్స్ కళాశాలలో స్టడీ సెంటర్ ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.braou.ac.inలోగానీ, నల్లగొండలోని రీజినల్ కోఆర్డినేషన్ సెంటర్ 9533101295, 7989339180 నంబర్లలోగానీ సంప్రదించాలని తెలిపారు.

జోరు వాన

- అత్యధికంగా కట్టంగూర్‌లో 10.2 సెంటీమీటర్ల వర్షపాతం
- వరి, పత్తి చేలకు తీరని నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పండగపూట తీవ్ర ఆందోళనలో రైతన్న

నల్లగొండ మండలం అర్జాలబావి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్30(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నల్లగొండ, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల, మద్దిరాల, రామన్నపేట, పోచంపల్లి, ఆలేరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. అత్యధికంగా కట్టంగూర్‌లో 10.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోనూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం సుమారు రెండు గంటల పాటు కురిసింది. వర్షం కురుస్తున్నంత సేపు పట్టణంలో కరెంటు సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. బుధవారం సాయంత్రం ఎనిమిది గంటల వరకు ఉన్న సమాచారం మేరకు... ఉమ్మడి జిల్లా పరిధిలోని సుమారు 30 మండలాల్లో వర్ష ప్రభావం కనిపించింది. 10.2 సెంటీమీటర్ల వర్షపాతంతో కట్టంగూర్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా వర్షపాతం నమోదైంది. తర్వాత నల్లగొండలో 4.6 సెంటీమీటర్లు, నార్కట్‌పల్లిలో 4.0, చిట్యాలలో 2.8, సూర్యాపేట జిల్లాలోని మద్దిరాలలో 4.2, మేళ్లచెర్వులో 1.6 సెంటీమీటర్ల వర్షం పడగా.. మోతె, నూతనకల్, అనంతగిరి, అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి, నడిగూడెం తదితర మండలాల్లో ఓ మోస్తరు కురిసింది. యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్‌లో అత్యధికంగా 3.0 సెంటీమీటర్లు, రామన్నపేటలో 2.9, పోచంపల్లిలో 2.3, వలిగొండ, ఆలేరులో 1.8 సెంటీమీటర్ల చొప్పున, మోటకొండూర్‌లో 1.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మోత్కూరు, రాజాపేట, భువనగిరి, తుర్కపల్లి, అడ్డగూడూరు తదితర మండలాల్లోనూ వర్ష ప్రభావం కనిపించింది.

తడిసిన ధాన్యం

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా అంతటా వరి కోతలు ముమ్మరంగా సాగుతుండగా పత్తి పంట కూడా ఏరుతున్నారు. ఈ క్రమంలో కురిసిన వర్షంతో ఆయా మండలాల్లోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లే. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట ఈ వర్షంతో పలుచోట్ల నేలవాలింది. ఇదే సమయంలో ఈదురుగాలులు వీయడంతో వడ్లు కూడా నేలరాలినట్లు తెలుస్తున్నది. ఇక మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు సైతం తడిసిపోయాయి. నల్లగొండ, కట్టంగూర్, నార్కట్‌పల్లి, రామన్నపేట తదితర మండలాల్లోని ఐఏపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసినట్లు తెలిసింది. నల్లగొండ పక్కన ఉన్న అర్జాలబావి కేంద్రంలో భారీగా వడ్లు వచ్చి ఉన్నాయి. వర్షానికి ఈ వడ్లు తడవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. తిరిగి వడ్లను ఆరబెట్టి తేమశాతం 17 వస్తేనే కొనుగోలు చేయనున్నారు. ఇలాంటి పరిస్థితి మిగతా చోట్ల కూడా నెలకొంది. ఇక పత్తి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఇటీవల తరుచుగా కరుస్తున్న వర్షంతో చేలపైన ఉన్న పత్తి నాణ్యత దెబ్బతిన్నది. తాజాగా బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతోనూ ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి చేలపైనే తడిసి ముద్దైంది. ఇప్పటికే పత్తి పంటకు మద్దతు ధర లభిస్తున్న పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆలస్యంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా వాటిల్లోనూ కొనుగోళ్లు ఊపందుకోలేదు. పత్తిలో తేమశాతం 8 వరకు ఉంటేనే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. కానీ వర్షాలతో చేలపైనే పత్తి తడవడంతో తేమశాతం 15 నుంచి 20శాతం వరకు ఉంటుండడంతో సీసీఐ కొనుగోలు చేయడం లేదు. దీంతో మరో ప్రత్యామ్నాయం లేక రైతులు గ్రామాల్లోని దళారులను ఆశ్రయించి అమ్ముకుంటున్నారు. దీని వల్ల క్వింటాలుకు 5,800 నుంచి 6,500 రూపాయలకు మించి ధర రావడం లేదు. సుమారు క్వింటాలుకు వెయ్యి రూపాయల వరకు పత్తి రైతు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యం లేదా పత్తిని తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

నల్లగొండలో కురుస్తున్న వర్షం

నల్లగొండలోని గాంధీనగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు